## ఉగాది మినీకథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు. 75/-పొందిన కథలు

# అద్దంలోని మోసం



సరికొండ రవీంద్రనాథ్

అనగనగా ఒక రాజు కతో...., సర్దాగా ఏటకెళ్ళిన కతో కాదండి; నిజంగా జరిగిన కతండి. ఊరుందండి కచగానిపాడో, సింవా చెలవో లేదా బద్రాసెలవో ఏదో వోటండి. పెతీ ఊర్లో జరిగే కతండి.

అక్కడీ మద్దెనే పెద్ద మిల్లొకటి పడిందండి – ఇంకే వుందండి ! జనం తెగ ఆనందపడిపోయేరండి. అందరు ఉజ్జోగస్తులైపోయినట్టు సంబర పడిపోయేరండి. కాదండి, ఎవరికివాళ్ళే మిల్లు తన సొంతమైనట్టు మురిసి పోయేరండి. పైనుంచి వెప్పినోల్లు గూడ అలాగే సెప్పేరండి. తమ సొంతంలాగానే పని చేయాలన్నారండి.

అక్కడే ఓ ముసలాడున్నాడండి. ఒకప్పుడు ఆడుకూడా ఇదే మిల్లులో పని సేశాడండి. ఇప్పుడు సేయడం లేదండి. మిల్లులో పడి కాలు పోనాదండి. కుంటుతాడండి. పనిమాత్రం సేయనేదండి. తింటాడండి. అదే వాడి యేడుపండి. బతికినంత కాలం మారాజులాగ బతికేను (పనిచేస్తూ) అని ఏడుత్తాడండి !

ఆడి కిద్దరుకొడుకులున్నారండి. ఓడి పేరు కిట్టిగాడు. ఓడిపేరు నెహ్రూ అండి. ముసలాడికి దేవుడంటే మహా భక్తండి. అందులో క్రిస్నుడంటే మరీనండి. గీతంటే సెవి కోసుకుంటాడండి. అది యినిపించేవాళ్ళు లేరండి! ఈడు సదవ లేడండి. ఇక రెండోవోడు పుట్టాడండి. ఇంతలో నెహ్రూగారు పైంమినిస్టరయ్యే డండి. మనోడుకూడా ఎందుక్కాకూడదని ఆడికా పేరు పెట్టాడండి.

ఆడు పుట్టిప్పటికి ముప్పైమూడు సంవత్సరాలండి.

ఈడు పుట్టిన రెణ్ణాళ్ళకే.... ముసలాడి భార్య, అదే సొరాజ్జం లేసిపోయినాదండి: బాగా యిసిగిపోయుంటదండి. ముసలాడితో పడ్లేక యెల్లిపోయిందండి. ముసలాడికి యింకా యింగితం సావనే దండి. లేసిపోయిన సొరాజ్జెం పెటపెట లాడుతూ వుండేదటండి. పచ్చగా వుండే దటండి. నిండుగా వుండేదటండి. యిప్పు డున్నా ముసల్ది కాదురా ! అంటాడండి. అదెప్పుడూ వయసుదే అంటాడండి. బెంగెట్టుకుని మాత్తరం సావనేదండి.

నెహ్రూగాడి గురించేనండి అంతా వచ్చింది. ఆడికి డిగ్రీ వుందండి. ఆడికి డిగ్రీ వుందండిగాని ఉజ్జోగం నేదండి. ఆడి అన్న కిట్టిగాడండి. సదూలేదండి. ఉద్యోగం వుందండి. మిల్లు వుందని సెప్పాను గదండి, అందులోనే కూలి పనండి. దాన్తోనే ముగ్గురు బతుకుతారండి. డిగ్రీ సేసినోడికి ఆ కూలిపని గూడ నేదండి. ఆడికీ, కుంటి ముసలాడికీ తేడా లేదండి. పైగా ముసలాడికి పౌరుసం వుందండి. ఈడికి అదీ లేదండి! ఆ డిగ్రీ ఇచ్చినోళ్ళనే అడగరాదా? అంత డబ్బు పెట్టి సదూకున్నావంటె-'సాల్లేవో'అంటా డండి. ఇంకేవో సెబుతాడండి. అంత డబ్బు పెట్టి సదవడం ఎందుకటండి? మన కర్థం కాదంటాడండి ఆ యిషయం. ఆడొక్కడే తెలివి కల్లోడండి.


ఓ రోజండి ముసలాడు మిల్లుకూలీల లీడర్ని పిలిసేడండి. నెహ్రూగాడి యిక


యమేసండి. కూలి ఉద్యోగం కోసవండి. రాచకీయవండి! ఎఱ్ఱ సొక్కా మాత్రం ఏసుకున్నాడండి. వచ్చాడండి. మిల్లులో పనిలేదని కొంతమందిని తీసేశారని సెప్పాడండి. మిగిలినోళ్ళంతా కలిసి ఆళ్ళను మళ్ళీ పెట్టుకోవాలని సమ్మె చేయాల్టండి. కిట్టిగాన్నిగూడ సెయ్యమన్నారండి. గొల్లుమన్నాడండి ముసలాడు. పెళ్ళి సెయ్యమని బాపనయ్యను పిలిస్తే తద్దినం తప్ప ఇంకేం పెట్టనన్నాడటండి. ఆ సావెతకే ఒచ్చిందండి. అయిపోయిందండి. లేనోడికి ఉద్యోగం ఏయించమని అడుగుదా మనకుండండి ముసలాడు. ఆ లీడరు ఉన్నోన్ని సమ్మె జెయ్యమంటన్నాడండి. ఉన్నది పోద్ది అన్నాడండి. రెండు సేతులు జోడించాడండి. ఇంకే వుందండి, లీడరండి, నోరు యిప్పేడండి. అన్న మాట అనకండా. ఇంటన్నడా యినడం లేదా అని సూడకండ మూడు గంటలు ఉపన్యాసం దంచేడండి. ముసలాడు అర్థంసేసుకున్నాడో. లేదోనండి. ఆ మాటల్లో ఏడు సముద్రాల ఘోషుందండి! భూదేవంత బరువుందండి! చీకటంత కష్టవుందండి, సూర్యుడంత యెలుగుందండి!

ఇయన్నీ ముసలాడు మోయలేడండి! అన్నీ వదిలేసేడండి. నా యెన్నుపూస మాత్రం కదిలిపోయిందండి. ఆ తరువాతండి అసలు కత! తెల్లారి ఊడబీకేసినోళ్ల తానంల నెహ్రూను పెట్టుకున్నారండి. తెగ మురిసిపోయినాడండి. ముసలాడు. ఆడేగనక కూలోడయ్యాడు గనక సరిపోయిందిగాని, దేశానికి పెసిడెంటయితే ముసలాడి గుండె పగిలిపోయేదండి. అలా సంబరపడిపోనాడండి. దాంతోటే మరుసట్రోజు కిట్టిగాడి ఉద్దోగం పోయిందండి. అదేనండి ఘోరమైన యిసయం. ఎక్కడా సూన్నేదండి. ఘొల్లుమన్లేదండిముసలాడు. ఉద్దోగం తీసేసినోళ్ళ నెవర్నీ తిట్నేదండి ఓపికవంతు డనుకునేరండి! దేవుడ్ని తిట్టేడండి. ఇప్పుడాయింట్లో పని సేసేది వొక్కడేనండి. ఆడిమీదనే అందరూ బతకాలండి. నెహ్రూగాడండి. ఆడు డిగ్రీ కాగితాలు తగలెట్టేసేనని సెప్పాడండి.

అది గాదండి సమస్య—మల్లొచ్చేడండి లీడరు. సమ్మె సెయ్యమన్నాడండి. ఆడి ఓపిక తగలడ మూడ్రోజులకింద ముసలాడు తిట్టిన తిట్టు తిట్టకుండా అరగంట తిట్టాడండి.... ఆడు లీడరు అందుకే అయాడు కామోసండి!

నెహ్రూ జీతవెంత అని అడిగేడండి. నాల్రూపాయలు అన్నాడండి. కిట్టిగాడు





## వివరాలు

పేరు : సరికొండ రవీంద్రనాథ్. జన్మ స్థలం వరంగల్ జిల్లాలో రాజోలుగ్రామం. ఖమ్మం యస్. ఆర్. అండ్ బి. జి. యన్. ఆర్. కళాశాలలో బి. యస్‌సి. మొదటి సంవత్సరం. నా మొదటి కథ 1978లో ఆంధ్రభూమిలో ప్రచురించబడింది. "చీకటి పిలిచింది."

రచయిత నయ్యేందుకు ప్రేరేపణ మా అమ్మ, నాన్న- రాధా, కిషన్ రావులు, మార్క్సిజం.

మీ ప్రోత్సాహాన్ని ఆశిస్తూ.

—సరికొండ రవీంద్రనాథ్

సేసేపని, నెహ్రూ సేసేపని ఒక్కటే అన్నాడండి. జీతాలు పోల్చేడండి. పని లోంచి పనిలేదని తీసేసి ఇంకోళ్ళను పెట్టుకోడంవల్ల మిల్లు యజమానులకు మిగులు రూపాయల్ని తేల్చి చెప్పాడండి. ఒక యింట్లోనే ఇది జరగడం అపూర్వం అన్నాడండి. సెరిత్రలో ఎప్పుడూ జరగనేదటండి. దవ్యోలబ్బణం అన్నాడండి. అన్నీ అర్థం కాలేదండి. కాని సరిగ్గా అప్పుడే గుర్తుకొచ్చిందండి. సిన్నప్పుడెప్పుడో మా అమ్మను అడిగానటండి. అద్దంలో నా, ముఖం యెనక్కూడా కనిపించాలని. నా కొడుకు రావులోరంతటోడని మా అమ్మ సంతోషపడిందిగాని, సెడ పుట్టిండని అందరూ తిట్టేరండి. ఇప్పుడు కనిపించిందండి. అన్ని వైపుల్నించి కనిపించిందండి. అద్దంలో కనిపించేదంతా అబద్ధమండి! మోసమండి! కుడి ఎడమలుగా కనిపిస్తదండి. వెనక భాగం అసలు కనిపించదండి. ఎంత తెలివి పెరిగినా మనిషి మంచిగా అద్దం తయారు సేయనేక పోయేడండి. మోసపోతున్నామండి! జాగర్తండి!!

లీడరు లేసిపోయాడండి - అనుభవజ్ఞుడండి.

ముసలాడు లేసే పెయత్నంలో లేడండి. నేను పెయత్నం సేత్తన్నానండి. ఇదండి కత!

---



# పాపం! చిరంజీవి

పంతుల నాగేశ్వరరావు

"దిక్కులేని ముసిలివాళ్ళందరికీ ప్రభుత్వం పెన్షన్లిస్తుంది" అన్న వార్త విన్నాడు ఆంజనేయులు. ఆంజనేయులంటే సాక్షాత్తూ మన పురాణాల్లో ఆంజనేయుడే.

ఆయన బంధువులూ, మిత్రులూ అంతా హెడ్ క్వార్టర్స్‌కి పోయి రంభ, ఊర్వశుల క్యేబేలూ, గంధర్వుల ఆర్కెస్ట్రాలు చూస్తూ ఉంటే చిరంజీవి అయిన పాపానికి ఇంకా ఈ భూమ్మీదే మగ్గుతూ అన్యాయాల క్యేబేలూ, భత్రాజుల ఆర్కెస్ట్రాలు చూడలేక గుళ్ళోకెళ్ళి కళ్ళు మూసుకున్నారు.

నేనూ ప్రయత్నించి చూస్తాను అనుకున్నాడు ఆంజనేయుడు. మనస్సులో ఓమాటు అన్పించింది నా రామచంద్రుడే నాకు దిక్కుకదా అని. కానీ దాన్నోరు నొక్కి పారేశాడు. అయినా ఇప్పుడాయనెక్కడున్నాడు? పార్టీ మార్చేశాడుగా.